క్లుప్తంగా

విద్యార్థి ప్రతిభ



మాచర్ల: ప్రతిష్టాత్మకమైన మంగళగిరి ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటును విద్యార్థి మిర్యాల జాషువా సాధించాడు. తండ్రి కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, అధికారులు పట్టణ ప్రముఖులు ఆశీర్వదించి, అభినందించారు.

రూ.50 వేలకు లడ్డూ వేలం



పిడుగురాళ్ల: పట్టణంలోని ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ గణేశ్ మహోత్సవంలో భాగంగా విగ్రహ కమిటీ 45 కేజీల లడ్డూ వేలం పాట సోమవారం నిర్వహించారు. రూ.50,116లకు పట్టణానికి చెందిన పాశం వెంకటేశ్వరరెడ్డి గణేశ్ లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను తలపై పెట్టుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణ సమీపంలోని కొండమోడు 220 కేవీ సబ్ స్టేషన్‌లో అత్యావసర మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం పిడుగురాళ్ల పట్టణం, జానపాడు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పరిహారం నగదు చెక్కులు అందజేత

మాచవరం: మండలంలోని వరద ప్రభావిత వేమవరం, గోవిందాపురం గ్రామాలకు రూ.లక్ష చొప్పున నగదు చెక్కులు అందించినట్లు ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు సోమవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల వరద బాధిత గ్రామాలకు విరాళాలు ప్రకటించిన నేపథ్యంలో నరసరావుపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని అధికారులు తెలిపారు.

న్యాయం చేయలేదని రాస్తారోకో

మాచర్ల: పట్టణంలోని నెహ్రూ నగర్ 1వ లైన్‌లో ఆదివారం రాత్రి బీసీ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య వాదన జరిగింది. ఓ వర్గానికి చెందిన యువకుడికి చేతి గాట్లు పడ్డాయి. కొందరు యువకులు తమను కావాలనే కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పూర్తిగా విచారించి, చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయినా వినకుండా సోమవారం ఉదయం 11గంటల సమయంలో బస్టాండ్ సెంటర్ రాస్తారోకో నిర్వహించి, వాహనాలు నిలిపివేశారు. అరగంట సేపు రాస్తారోకో జరగగా ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ నారాయణ, ఎఎస్ఐ రమేష్ వారికి సర్ది చెప్పారు.

ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



మాచర్ల: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని గోరంట్ల కెనడి నెక్స్ జెన్ పాఠశాలలో ఆదివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. పట్టణంలోని కిడ్స్ స్కూల్ ప్రిన్సిపల్ జీవీఎస్ రామకృష్ణ శాస్త్రి అవార్డు అందుకున్నారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పవన్ కుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ ఆనంద్ అవార్డు పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఆధ్వర్యంలో ఐకానిక్ టీచర్ అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, హెచ్ఆర్ మేనేజర్ ఆర్ శ్రీనివాసరావు, అధికారులు ఉపాధ్యాయులను అభినందించారు.

అదుపుతప్పి పల్టీకొట్టిన కారు



నరసరావుపేట రూరల్: రావిపాడు రోడ్డులో కారు అదుపుతప్పి కాలువలోకి పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు నకరికల్లు నుంచి నరసరావుపేటకు వస్తున్న కారు రావిపాడు ఎస్సీ కాలనీ సమీపంలోకి రాగానే అదుపు తప్పింది. పక్కనే కాలువలోకి కారు పల్టీ కొట్టింది. స్థానికులు వెంటనే స్పందించి కారులో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

సత్యసాయి సేవే స్ఫూర్తిగా..

- భక్తుల సంకల్పమే పునాది శ్రీ సత్యసాయి విద్యా విహార్
- దశాబ్దిన్నరకు పైగా పల్నాటి పేద పిల్లలకు ఉచిత విద్య
- దాతల సహకారంతో సకల సౌకర్యాల కల్పన

పుట్టపర్తి సత్యసాయి బాబా ఆశీర్వాదం ..బాబా సేవా గుణాన్ని స్ఫూర్తి పొందిన ఇద్దరు భక్తుల సంకల్పం.. వెరశి పల్నాటి సీమలో పేద విద్యార్థులకు వరమైంది. నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్న పిల్లలను చూసి, స్పందించిన నిమ్మగడ్డ దుర్గా ప్రసాద్, జక్కా శ్రీనివాసరావు శ్రీ సత్యసాయి విద్యా విహార్‌కు శ్రీకారం చుట్టారు. మాచర్ల పట్టణంలోని సొసైటీ కాలనీలో 2006లో 40 మంది ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులతో పాఠశాల ప్రారంభించారు. నేడు పదో తరగతి వరకు 470 మంది హాజరుతో ఎలాంటి ఫీజు లేకుండా విద్యా వ్యాప్తి కొనసాగుతోంది.



శ్రీ సత్యసాయి విద్యా విహార్ పాఠశాల భవనం, ఆవరణ

మాచర్ల: విద్యా విహార్ గురించి తెలుసుకున్న ఎన్ఆర్ఐలు, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్‌తో పాటు సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా తమవంతు సాయమందించేందుకు ముందుకొచ్చారు. సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో 2010లో రిజిస్టర్ అయ్యి.. స్వచ్ఛందంగా పాఠశాల నిర్వహణ ఖర్చులన్నీ చూస్తున్నారు. 25 మంది టీచర్లకు, సిబ్బందికి ఏటా రూ. 30 నుంచి రూ.40 లక్షలు జీతభత్యాల రూపంలో చెల్లిస్తున్నారు. విద్యా విహార్ ఫౌండర్లు, మరికొంత మందితో కలిసి ఏడాది ఒక్కో తరగతిని పెంచుకుంటూ.. అందుకనుగుణంగా దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేశారు.



తరగతి గదిలో విద్యార్థులు

అత్యాధునిక సౌకర్యాలు..

విద్యా విహార్‌లో ల్యాబ్, డైనింగ్ హాలు, సైన్స్ ల్యాబ్, క్రీడా మైదానం, సైకిల్ స్టాండ్ ఉంది. మొత్తం పాఠశాల ఆవరణలో పచ్చదనంతో నింపి,



విశాలమైన కళాశాల ప్రాంగణం

సాంస్కృతి కార్యక్రమాలు, విజ్ఞానం పెంపొందించే విధంగా ఏర్పాట్లు చేశారు. మొత్తం 12 సెక్షన్లతో విద్యాబోధన జరుగుతోంది. ఒక్క రూపాయి కూడా విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల నుంచి తీసుకోకుండా చదివిస్తున్నారు. విద్యతో పాటు అదనంగా ఆధ్యాత్మిక చింతన, మానవతా విలువలను జోడించి, సత్యం, ధర్మాన్ని బోధిస్తారు.

రాణిస్తున్న విద్యార్థులు

విద్యా విహార్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. క్విజ్, వ్యాస రచన వివిధ పోటీల్లో పలు విజేతలుగానూ నిలుస్తున్నారు. వేలాది మందిని ఉత్తములుగా తీర్చిదిద్ది, పేద పిల్లల కల్ప తరువుగా మారిందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుణపడి ఉంటాం



మాది పేద కుటుంబం. నా తల్లిదండ్రులు కష్టపడి పనిచేస్తారు. నా చదువు ఆగిపోతుందని భయపడుతున్న సమయంలో శ్రీ సత్యసాయి విద్యా విహార్‌లో సీటు వచ్చింది. ఉచితంగా చదువుకుంటున్నాం. ఇంత మంచి విద్యా బోధన ఎంత డబ్బులిచ్చినా రాదు. మా కుటుంబమంతా రుణపడి ఉంటుంది.

– కార్తిక్, విద్యార్థి, 10వ తరగతి

సత్యసాయినే అవకాశం కల్పించారు



శ్రీ సత్యసాయి విద్యా విహార్‌లో ఉచిత విద్యా బోధన అందిస్తున్నారని తెలుసుకొని తల్లిదండ్రులకు చెప్పాను. ఇక్కడ చదుకునే అవకాశం వచ్చింది. ఒక్క రూపాయి కూడా కట్టకుండా పదో తరగతి వరకు ఇక్కడే చదువుతున్నా. సత్యసాయి బాబానే మాకు అవకాశం కల్పించారు.

– నాగూర్ బీ, విద్యార్థిని, పదో తరగతి.

ఇది మా అదృష్టం



సత్యసాయి విద్యా విహార్‌లో పనిచేయడం నా అదృష్టం. ఎంతో మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నాం. పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కళ్లల్లో వెలుగును చూశాను. విలువలతో కూడిన బోధన అందించడాన్ని నా బాధ్యత నెరవేరుస్తున్నాను.

– రమాదేవి, హెచ్ఎం, విద్యా విహార్

సాయి బాబా సంకల్పం



సత్య సాయిబాబా భక్తులకు, పేదలకు ఏదోవిధంగా ఉపయోగపడాలని స్వర్గీయ నిమ్మగడ్డ లక్ష్మీ ప్రసాద్‌తో కలిసి శ్రీ సత్యసాయి విద్యా విహార్‌కు రూపకల్పన చేశాం. ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుంటున్నామనే సంతృప్తి మిగిలింది. దాతల సహకారంతో ఉచిత విద్యనందించగలుగుతున్నాం. – జక్కా శ్రీనివాసరావు, ఫౌండర్

మావోయిస్టులతో చర్చలు చేపట్టాలి

నరసరావుపేట: తెలంగాణ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేసి మావోయిస్టులతో ఆయా ప్రభుత్వాలు చర్చలు నిర్వహించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయ ప్రాంగణంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, ఏపీ గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటనాయక్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తాము గెలిస్తే ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించి గెలిచిన అనంతరం బూటకపు ఎన్‌కౌంటర్లకు తెర తీసిందన్నారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, ప్రజా కళ మండలి రాష్ట్ర ట్రెజరర్ ఉన్నం నాగేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శిఖినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నలుగురు దొంగలకు రిమాండ్

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో అర్ధరాత్రి దొంగతనం చేస్తూ పట్టుబడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు ఆగస్టు 27న గ్రామానికి చెందిన బేతంచర్ల హనుమంతరావు ఇంటితో పాటూ మరో ఇంటిని దోచుకునేందుకు ఎనిమిది మంది దొంగలు ప్రయత్నించారు. నాలుగు బైక్‌లపై వచ్చిన వీరిని స్థానికులు గుర్తించి వెంటపడ్డారు. నలుగురు బైక్‌లపై పారిపోగా, మరో నలుగురు పట్టుబడ్డారు. దొరికిన వారిలో పిడుగురాళ్ళకు చెందిన కొత్తపల్లి ఎలీషా, కుంచెపు వెంకటకృష్ణ, నంబూరుకు చెందిన పాదిలి మనోహర్, గుంటూరులోని గోరంట్లకు చెందిన వంగా గణేష్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపల్లి ఎలీషా, వెంకట కృష్ణలపై గతంలో కేసులు ఉన్నాయి. ఇటీవల సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, గుంటూరు, నల్లపాడు, మేడికొండూరుల్లో పలు దొంగతనాలకు పాల్పడ్డారు. పరారీలో ఉన్న నలుగురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కోర్టుకు హాజరుపరచిన నలుగురికీ న్యాయమూర్తి రిమాండ్ విధించారు.



మాచర్ల ఆర్‌కేసీ కాలనీలో గణేషునికి పూజలు



మాచర్లలోని పిన్నెల్లి లక్ష్మారెడ్డి బజారులో అన్నదానం



దాచేపల్లి : ముత్యాలంపాడులో వినాయకుడి విగ్రహం ఊరేగింపు..

జైజై గణేశా..

వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు సోమవారం నిమజ్జనోత్సవానికి గణనాథుడి విగ్రహాలు తీసుకెళ్తున్నారు. మంగళ వాయిద్యాలు, తప్పెట్ల మధ్య ఉత్సాహంగా ఊరేగింపులు నిర్వహించారు. మండపాల వద్ద భారీగా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. జై బోలో గణేష్ మహారాజ్‌కి జై.. అంటూ అందరూ ఉత్సవ విగ్రహాల వెంట తరలివెళ్లారు.

- మాచర్ల



పిడుగురాళ్లలో ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలు



కారెంపూడి అంకాలమ్మ గుడి సెంటర్‌లో సహస్రనామ పారాయణం



పిడుగురాళ్లల్లో భారీ ఊరేగింపు

మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

గురజాల : మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జీబీసీ కాలనీలో వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి కర్రా గిరిబాబు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మాజీ డైరెక్టర్ కర్రా ప్రగతి పాల్గొన్నారు. బెంగుళూర్ సిటి పాస్టర్ పాల్ పినేహస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాలనీలో మొక్కలు నాటారు. కర్రా చిన కోటేశ్వరరావు, ఇశ్రాయేలు, చాగంటి సురేష్, సురేష్ బాబు, పుల్లారావు, చందు పిచ్చయ్య, శేఖర్, కె సందీప్ సంపత్ పాల్గొన్నారు.

– స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పార్టీ పట్టణ కన్వీనర్ కె.అన్నారావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దాచేపల్లి : నారాయణపురం, గామాలపాడులో కాసు పుట్టినరోజు వేడుకలు జరిగాయి. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సాంబయ్య, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, ఎంపీపీ జాను పాల్గొన్నారు.

మాచవరం: మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను మండపాల సెంటర్‌లో నిర్వహించారు. జెడ్పీటీసీ జివ్వెనబోయిన శివా యాదవ్, సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీలు చిట్టిప్రోలు గురవయ్య వేడుకల్లో పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కాసు మహేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు కేక్ కట్ చేశారు. ఎంపీపీ గార్లపాటి అనసూర్య వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బచ్చేమేస్త్రీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాలే మాణిక్యరావు, మాచవరం కో–ఆప్షన్ సభ్యులు షేక్ మహ్మద్ జాని పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: కాసు మహేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వాసవీ జాగృతి క్లబ్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో జూలకంటి చారిటబుల్ ట్రస్టు సహకారంతో సోమవారం 23వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ జూలకంటి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామరావు, కౌన్సిలర్ గర్నె నాగేశ్వరరావు, మార్కెట్ మాజీ డైరెక్టర్ వాణి, అమర్ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌కు బాలికల ఎంపిక

శావల్యాపురం: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఏడుగురు బాలికలు ఎంపికై నట్లు శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపికైన బాలికలతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపి శావల్యాపురం హైస్కూలకు మంచి పేరు తేవాలన్నారు. వేముల దివ్య (ఇంటర్) మూట్లూరి లూధియా (ఇంటర్) బండారు దేవమణి (ఇంటర్) ఆర్.రత్నకీర్తన (10వ తరగతి) బండారు రవళీ (9వ తరగతి) ఉప్పు లలిత (9వ తరగతి) చల్లా శ్రీహర్షిత (9వ తరగతి) ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 15 తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే తొమ్మిదవ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, భువనేశ్వరీ ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి సందర్శించారు. చందవరం గ్రామానికి చెందిన రైతు శివనాగేశ్వరరావు కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తున్నారు. తనకున్న యకరం పొలంలో ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా అనేక రకాల కూరగాయలు, పండ్లు, తీగ, దుంపజాతి కూరగాయాలు పండిస్తున్నారు. ఆయన ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచే పద్ధతి అనుసరిస్తూ నిరంతర ఆదాయం పొందుతున్నారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతాలను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ నెలకు సగటున రూ.25–30 వేల ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ రైతు శివనాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని ఏకకాలంలో పలు రకాల కూరగాయలు, పండ్లను పండించటం వలన నేలతల్లి ఆరోగ్యం బాగుండి మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వలన ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలను ఆర్‌బీకేల్లో ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.

వీఆర్‌ఏపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె వీఆర్‌ఏ షేక్ జాన్‌పై మారణాయుధంతో దాడి చేసిన ఉడతా గోపిని అరెస్టు చేసి శిక్షించాలని జిల్లా వీఆర్‌ఏ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీఐ శ్రీనివాస రావుకు, తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏ సంఘం అధ్యక్షుడు షేక్ బంద్ గీ సాహెబ్ మాట్లాడుతూ అర్ధరాత్రి వీఆర్‌ఏ జాన్ తన ఇంటి వరండాలో నిద్రిస్తున్న సమయంలో గేటు దూకి వచ్చి ఉడతా గోపి ఇనప రాడ్డుతో దాడి పాల్పడ్డారన్నారు. జాన్‌పై జరిగిన దాడిపై విచారణ చేపట్టాలని కోరారు. నిందితుడు ఉడతా గోపి నుంచి జాన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని సీఐకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తగిన చర్యలు తీసుకోరపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి సూరిబాబు వీఆర్‌ఏల సంఘ నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏ సంఘ నాయకులు

• గుంతల మయం



వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని జానపాడు రోడ్డులో రైల్వే గేటు దాటిన తర్వాత అంతా గుంతల మయమైంది. ద్విచక్ర వాహనదారులు, ఆటో వాలాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంత లోతు తెలియకపోవడంతో ద్విచక్ర వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. అధికారులు తక్షణమే గుంతలను పూడ్చి, మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- పిడుగురాళ్ల

జాతీయ తైక్వాండో పోటీలకు తులసీతన్మయ్



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ద్వితీయ సంవత్సరం నర్సింగ్ విద్యార్థిని వి.తులసీతన్మయ్ జాతీయస్థాయి తైక్వాడ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ సోమవారం తెలిపారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ద్వితీయ అస్మితా తైక్వాండో ఉమెన్స్ లీగ్–2024 రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో తులసీ తన్మయ్ ప్రతిభ చూపి ఆంధ్రప్రదేశ్ సీనియర్స్ మహిళా టీంకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడులోని దిండిగల్‌లో ఈనెల 11 నుంచి 14వతేది వరకు జరగనున్న తైక్వాండో పోటీలలో తులసీతన్మయ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జాతీయస్థాయి పోటీలో పాల్గొంటున్న తులసీ తన్మయ్‌ను కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.